క్లుప్తంగా

మూడు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

తవణంపల్లె: ఈ నెల 13వ తేదీన జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ కోసం తవణంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ సుశీల తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలో తవణంపల్లె హైస్కూల్లో 149 పోలింగ్ కేంద్రాన్ని ఉపాధ్యాయులకు, 284, 285 రెండు పోలింగ్ కేంద్రాలను పట్టభద్రులకు కేటాయించినట్లు వివరించారు. మండలంలో ఉపాధ్యాయులు 44 మంది ఓటర్లు ఉండగా పట్టభద్రులు 1643 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.

మాతమ్మ జాతర రేపు


మాతమ్మ అమ్మవారు

బంగారుపాళెం: మండలంలోని కుప్పాళ్లపల్లెలో మంగళవారం మాతమ్మ జాతర నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పల్లవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజలు హోమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. జాతరలో భాగంగా బుధవారం వేప, రాగి చెట్లకు కల్యాణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. పెద్దసంఖ్యలో భక్తులు మాతమ్మ జాతరలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

వస్తు సామగ్రి వితరణ


మహిళలకు ప్యాడ్స్‌ను పంపిణీచేస్తున్న ట్రస్ట్ అధ్యక్షురాలు సరస్వతి

గుడిపాల: మండలంలోని తిమ్మాపల్లె హరిజనవాడలో సరస్వతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు ప్యాడ్లు, పిల్లలకు వాటర్‌బాటిళ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షురాలు సరస్వతి మాట్లాడుతూ తమ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించి, వారికి ఉచితంగా వస్త్రంతో తయారు చేసిన బ్యాగ్‌లను అందజేశారు. ప్లాస్టిక్ బ్యాగులు వద్దు వస్త్రం బ్యాగులే ముద్దు అని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ కవర్ వాడడం వల్ల జీవుల ప్రాణాలకు కూడా చాలా ముప్పు అన్నారు. కార్యక్రమంలో ట్రెజరర్ రాధాకృష్ణారెడ్డి, సెక్రటరీ అమరనాథరెడ్డి పాల్గొన్నారు.

మోహినీ రూపంలో కోదండరాముడు



శాంతిపురం: మోహినీ రూపంలో ఉదయం విహరించిన కోదండ రాముడు రాత్రి గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులకు కటాక్షించాడు. రాళ్లబూదుగూరు లోని కోదండరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామి వారిని మోహిని అవతారంలో ఊరేగించారు. జ్యోతినగర వైశ్య సంఘం ఆధ్వర్యంలో మధ్యాహ్నం ఆలయంలో సీతారాముల కల్యాణం జరిపించారు. ముక్కోటి దేవతలను ఆహ్వానించి, వారి సమక్షంలో స్వామితో అమ్మవారి కల్యాణం మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా చేశారు. రాత్రి గరుడ వాహనంపై స్వామి వారు గ్రామ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చాడు. ఈ సందర్భంగా మహా వాయిద్యా ల ప్రదర్శన, బాణసంచా వేడుకలు నిర్వహించారు.

రిస్క్ లేకుండా..!

తమిళనాడులోని చెంగళ్‌పట్టుకు చెందిన తేజ అనే గర్భిణి గత నెల ప్రసవం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిని ఆశ్రయించింది. ఈమె తొలి నుంచి కూడా అక్కడ ఓ ప్రైవేటు ఆస్పత్రిలోనే చికిత్స తీసుకుంటోంది. ప్రసవం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి రాగా హైరిస్క్ కేసుగా గుర్తించిన డాక్టర్లు వెంటనే సుఖప్రసవం చేసి తల్లీబిడ్డను సురక్షితంగా ఇంటికి పంపారు.

అలాగే తమిళనాడులోని కాంచిపురానికి చెందిన మహాలక్ష్మి అనే గర్భిణి కూడా డెలివరీకి చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి చేరింది. స్కానింగ్ రిపోర్టు, వారు తీసుకున్న చికిత్స వివరాలను పరిశీలించిన డాక్టర్లు బీపీతో పాటు ఉమ్మనీరు సమస్య ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఆపరేషన్ మొదలు పెట్టారు. బిడ్డను సురక్షితంగా బయటకు తీశారు. ఇలాంటి కేసులు ఆస్పత్రికి చాలానే వస్తున్నాయి. హైరిస్క్ గర్భిణులకు శాపంగా మారింది.

- హైరిస్క్ కేసులకు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం
- ఆస్పత్రికి పెరుగుతున్న రెఫర్ కేసులు
- సురక్షిత ప్రసవాలకే అధిక ప్రాధాన్యత ఇస్తున్న వైద్యాధికారులు
- ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పని చేస్తున్న వైద్యులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం కోసం ప్రత్యేక విభాగం ఉంది. ఈ విభాగంలో ఎంసీహెచ్ పోస్ట్ ఆపరేటర్ వార్డులో 50 బెడ్లు, పోస్ట్ నేటల్ వార్డులో 50 బెడ్లు ఉండగా సాధారణ బెడ్లు 150 దాకా ఉన్నాయి. గైనిక్ వైద్యులు ఎనిమిది మంది, పీజీలు నలుగురు, హెడ్ నర్సులు ఆరుగురు, స్టాఫ్ నర్సులు 25 మంది, ఇతర సిబ్బంది 30 మంది దాకా ఈవిభాగంలో పని చేస్తున్నారు. ఆస్పత్రిలో రోజుకు 20 నుంచి 25 ప్రసవాలు జరుగుతున్నాయి. ఇందుకోసం చిత్తూరు పరిసర ప్రాంతాల వాసులే కాకుండా దూర ప్రాంతాల నుంచి పదుల సంఖ్యలో ఆశ్రయిస్తున్నారు. తమిళనాడులోని పరదరామి, తిరుత్తణి, వేలూరు, కాట్పాడి, సోలింగరం, పళ్లిపట్టు, కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు, జిల్లాలోని పలమనేరు, కుప్పం కార్వేటినగరం తదితర ప్రాంతాల నుంచి ఈ ఆస్పత్రికి వస్తుంటారు. అయితే ఇందులో హైరిస్క్ కేసులు ఎక్కువగా ఉంటున్నాయని అధికారులు చెబుతున్నారు.


చికిత్స కోసం క్యూలో వేచి ఉన్న గర్భిణులు

హైరిస్క్‌కు తక్షణ వైద్యం..

రాష్ట్రప్రభుత్వం వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న విషయం తెలిసిందే. కాన్పులను సైతం పెద్దాస్పత్రిలో ఉచిత వైద్యంతో పాటు ఆరోగ్య ఆసరా కింద కాన్పు అయిన మహిళలకు డిశ్చార్జ్ అయ్యేలోపు ప్రభుత్వం నేరుగా నగదు సైతం బ్యాంకు ఖాతాలో జమ చేస్తోంది. ఆ రకంగా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలతో పాటు సౌకర్యాలు ఏర్పాటు చేసింది. దీంతో పాటు గర్భిణులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు ఆస్పత్రిలో సుఖ ప్రసవం జరిగేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో వైద్యులు ప్రధానంగా బీపీ షుగర్, రక్తహీనత, గుండె జబ్బులు, లివర్ సమస్యలు, ఉమ్మనీరు పోవడం వంటి లక్షణాలతో వచ్చిన అత్యంత హైరిస్క్ గర్భిణులను అక్కున చేర్చుకుని, తక్షణ వైద్యసేవలు అందిస్తున్నారు.

ప్రైవేటుగా అయితే కాసులే..

ఈ హైరిస్క్ గర్భిణితో పాటు పుట్టబోయే బిడ్డ ప్రాణానికి సైతం ప్రమాదం పొంచి ఉంది. కార్పొరేట్ ఆస్పత్రులకు ఇలాంటి కేసులు అడుగు పెడితే తల్లీబిడ్డకు రిస్క్ అని చెప్పి రూ.లక్షల్లో దండుకుంటున్నారు. అయితే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి హైరిస్క్ కేసులకు పురుడు పోస్తోంది. తల్లీబిడ్డను సురక్షితంగా ఇంటికి చేరుస్తోంది. గత ఏడు నెలల కాలంలో 3,115 ప్రసవాలు జరిగాయి. ఇందులో 332 హైరిస్క్ కేసులు రాగా 265కు ప్రసవాలు చేశారు. గతంలో ఇన్ని కేసులు ఆస్పత్రికి వచ్చేవి కావని అధికారులు అంటున్నారు.

హైరిస్క్ ప్రసవం వివరాలు..

నెల	ఆసుపత్రికి వచ్చిన హైరిస్క్ కేసులు	ప్రసవం చేసిన కేసులు
2022		
ఆగస్టు	47	39
సెప్టెంబర్	53	43
అక్టోబర్	51	48
నవంబర్	46	39
డిసెంబర్	48	36
2023		
జనవరి	45	29
ఫిబ్రవరి	42	31

రిస్క్ లేకుండా ప్రసవం..



మాది వి.కోట. ప్రసవ చికిత్స అంతా అక్కడే చూశాం. కానీ హైరిస్క్ అని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చాం. ఇక్కడ వెంటనే అడ్మిట్ చేసుకున్నారు. రిస్క్ లేకుండా ప్రసవం చేశారు. బిడ్డ, నేను బాగానే ఉన్నాం. మెరుగైన వైద్యం అందిస్తున్నారు. మూడు రోజుల్లో ఇంటికి వెళ్లొచ్చన్నారు.

– అఖిల, వి.కోట

పౌష్టికాహారం అవసరం..



గర్భిణి అని తెలిసిన వెంటనే డాక్టర్లను సంప్రదించాలి. వారి సూచనలు తీసుకోవాలి. ముఖ్యంగా మంచి పౌష్టికం ఉన్న పదార్థాలను తీసుకోవాలి. గర్భిణి సమయంలో ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే ప్రసవం కష్టమవుతోంది. సరైన పౌష్టికాహారం తీసుకోకపోవడం వల్లే హైరిస్క్ కేసులు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా 18 ఏళ్లు దాటిన తర్వాత పెళ్లి చేసుకోవడం మంచిది.

– డాక్టర్ ఉషశ్రీ, గైనిక్

ప్రభుత్వ ఆశయం మేరకే..



ప్రభుత్వం సుఖ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకుంటోంది. అందుకు తగ్గట్టు ప్రతి ఆస్పత్రిలోను తగిన సూచనలు చేశాం. జిల్లా ఆస్పత్రిలో ప్రసవం కేసులు పెంచడంతో పాటు ఏరియా, సీహెచ్‌సీల్లో కూడా డెలివరీలు కూడా లక్ష్యం మేరకు జరిగేలా చూస్తున్నాం. వీలైనంత వరకు రెఫర్ కేసులు తగ్గించాలని చూస్తున్నాం. ఆ రకంగా అధికారులు పనిచేయాలి.

– బీఎస్‌కే నాయక్, డీసీహెచ్ఎస్, చిత్తూరు

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం


సంతపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు


గుడిపాల: ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని కట్టమంచి, దొడ్డిపల్లె, రఘురాంనగర్, సంతపేట, మంగసముద్రం, లెనిన్‌నగర్, ఓబనపల్లె, దొంగలబావివీధి, అరగొండరోడ్డు ప్రాంతాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ఆదివారం ముమ్మరంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ బలపరచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటును వేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఓటర్లను అభ్యర్థించారు. రాష్ట్ర అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ల నగర ఇన్‌చార్జ్‌లు కిరణ్, రామ్‌గణేష్, మేయర్ అముద, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, కార్పొరేటర్లు జ్ఞానజగదీష్, స్వరూపరాణి, హరిణిరెడ్డి, రెడ్డెప్ప, సునీత, నాయకులు కృష్ణారెడ్డి, నారాయణ, భూపేష్, తదితరులు పాల్గొన్నారు.

పేర్నాటిని గెలిపించండి

గుడిపాల: తూర్పు, రాయలసీమ నుంచి పట్టభద్రుల స్థానానికి వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి పట్టభద్రుల ఓటర్లను అభ్యర్థించారు. ఆదివారం మండలంలోని 189కొత్తపల్లె, బసవాపల్లె, మరకాలకుప్పం, కృష్ణజమ్మాపురం, మందికృష్ణాపురం పంచాయతీల్లో పట్టభద్రులను కలుసుకుని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పథంలో దూసుకెళ్లాలంటే వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలన్నారు. రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, జేసీఎస్ కన్వీనర్ సాయి, నాయకులు కారిమేఘన్, సుధాకర్‌నాయుడు, సంపత్, చిట్టిబాబు, పెరిల్లా, ప్రసాద్‌రెడ్డి, కుమార్, శివలు పాల్గొన్నారు.

నేడు పోలీసు కార్యాలయంలో స్పందన

చిత్తూరు అర్బన్: నగరంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ వై.రిశాంత్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న ఆర్మ్‌డ్ రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే ప్రజలు నేరుగా తనను కలిసి మాట్లాడవచ్చని పేర్కొన్నారు.

కార్పొరేషన్ కార్యాలయంలో..

చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు కమిషనర్ జె.అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి స్పందన జరుగుతుందన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే నగరంలోని 50 డివిజన్లలో ఉన్న వార్డు సచివాలయ కార్యాలయాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య స్పందన జరుగుతుందన్నారు. స్థానికంగా ఉన్న ప్రజలు ఆయా సచివాలయాల్లో వినతులు అందజేయవచ్చన్నారు. అలాగే ప్రజలు ఇంటి నుంచే కార్పొరేషన్ కాల్ సెంటర్ 08572232745, వాట్సాప్ నంబర్ 98499 07885కు సమస్యలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

నేడు తహసీల్దార్ కార్యాలయంలో..

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పార్వతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకోరావచ్చని పేర్కొన్నారు.

చిరువ్యాపారులకు జగనన్న తోడు

అరకొర వ్యాపారంతో అంతంత మాత్రం బతుకు బండి లాగించే చిరు వ్యాపారుల ముఖాల్లో ఇప్పుడు ఆనందం కనిపిస్తోంది. వారి బతుక్కి ఆసరా దొరికింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం వారికి జగనన్న తోడు పథకం ద్వారా వడ్డీలని రుణాలను అందిస్తోంది. ఈ పథకం శ్రమజీవులకు కొండంత భరోసా ఇస్తోంది.

- బాసటగా నిలుస్తున్న వడ్డీ లేని రుణం
- ఆనందం వ్యక్తం చేస్తున్న చిరు వ్యాపారులు

గుడిపాల: చిరువ్యాపారుల ఆర్థిక పరిపుష్టికి ప్రభుత్వం బాసటగా నిలుస్తోంది. గ్రామాల్లో తోపుడుబండ్లు, కూరగాయలు, పూల వ్యాపారం, చిన్న దుకాణాలు నిర్వహించుకునే వారికి జగనన్నతోడు పథకంతో బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలు ఇస్తుండడంతో వారి జీవితాల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు చిరువ్యాపారులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. దీంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిరువ్యాపారుల మన్ననలు పొందుతున్నారు. బ్యాంకుల ద్వారా వడ్డీలేకుండా చిరువ్యాపారులకు రూ.10 వేల రుణాన్ని అందిస్తున్నారు. లబ్ధిదారులు ఆ రుణాన్ని వాయిదాల చొప్పున సక్రమంగా చెల్లిస్తే, దానిపై పడే వడ్డీ భారాన్ని ప్రభుత్వమే బ్యాంకులకు చెల్లిస్తుంది.

శ్రమజీవులకు చిరుసాయం

తమ కష్టానికి ప్రభుత్వం అందిస్తున్న జగనన్న తోడు పథకం ద్వారా తమకు ఎంతో మేలు జరుగుతోందని చిరువ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమకు సాయం అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సాయం ఎన్నటికీ మరువమని చెబుతున్నారు. చిత్తూరు నియోజవర్గంలో జగనన్న తోడు పథకం ద్వారా ఇప్పటివరకు 14085 మందికి రూ.10 వేలు చొప్పున రుణసాయం మంజూరైంది. మండలాల వారీగా గుడిపాలలో 2,528 మంది, చిత్తూరు రూరల్‌లో 2,158 మందికి, చిత్తూరు అర్బన్‌లో 9,399 మందికిగాను రూ.14 కోట్ల 8 లక్షల 50వేల వరకు రుణం అందింది.



చిరు వ్యాపారులకు జగనన్న తోడు పథకం నమూనా చెక్‌ను అందజేస్తున్న కలెక్టర్ హరినారాయణన్ (ఫైల్)

వ్యాపారానికి తోడుగా..

నేను గుడిపాలలో పూలదుకాణం నడుపుతున్నాను. ప్రభుత్వం అందించిన రుణం పూల వ్యాపారాన్ని మరింత విస్తరించేందుకు దోహద పడుతోంది. జగనన్నతోడు నిజంగానే వ్యాపారాభివృద్ధికి తోడుగా నిలిచింది. రూ.10 వేలు రుణం తీసుకుని నెలకు రూ.వెయ్యి బ్యాంకుకు కడుతున్నా.

– శ్రీనివాసులు పూలవ్యాపారి, గుడిపాల

రుణ సాయం మరువలేనిది

మాలాంటి చిరు వ్యాపారులను ఆదుకునేందుకు జగనన్న తోడు పథకం ద్వారా రుణసాయం అందించడం అభినందనీయం. వడ్డీలేని ఈ సొమ్ముతో నా వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసుకున్నాను. ప్రతినెలా బ్యాంకుకు రూ.వెయ్యి కడుతున్నా. కట్టిన తరువాత తిరిగి మళ్లీ జగనన్నతోడు ఇస్తామన్నారు.

– అమ్ములు, చిల్లరదుకాణ నిర్వాహకుడు, నరహరిపేట

ఘనంగా మహిళా సాధికారిత దినోత్సవం


సన్మానం అందుకున్న వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న మహిళలు

చిత్తూరు రూరల్: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని చిత్తూరు నగరంలోని రెవెన్యూ భవనంలో ఆదివారం నిర్వహించి సాధికారిక–చైతన్య సాంస్కృతిక కార్యక్రమం అలరించింది. మన సంస్కృతి కళాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పలువురు దాతలు, రచయితలు, కవులు హాజరయ్యారు. తొలుత విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు రంజింపజేశాయి. అనంతరం వక్తలు మహిళా దినోత్సవాన్ని ఉద్దేశించి మాట్లాడారు. మహిళలు వివిధ రంగాల్లో రాణిస్తూ విశిష్ట సేవలు అందిస్తూ, చైతన్యవంతులు కావాలన్నారు. మహిళా సాధికారిత దిశగా ముందుకు వెళ్లాలన్నారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో సహదేవనాయుడు, రెడ్డప్ప, శ్యామలదేవి, ప్రసూన, రుక్మిణి, విజయలక్ష్మి, రాధ, యశోద, కవిత, రెడ్డెమ్మ, లక్ష్మి, శాంతా భాస్కర్, మాధవి, లత, కృష్ణవేణి, భారతి, శివమ్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.

పుణ్యఫలం.. లక్ష్మీగణపతి హోమం..

కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో విశాఖ శారదా పీఠాధిపతులు శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి ఆలయ అర్చక వేదపండితులతో కలిసి లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. మొదటగా గోవుకు పూజలు చేశారు. అనంతరం వినాయక స్వామికి, గంగకు హారతులు ఇచ్చారు. అంతకుముందు స్వామివారికి సుప్రభాత సేవలో ఉపయోగించే బిందుతీర్థంకు విశాఖ శారదా ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి ప్రత్యేక పూజలు చేశారు.

– కాణిపాకం(యాదమరి)


పవిత్ర జలాలను ఊరేగిస్తున్న ఆలయ అర్చకులు


గోవుకు పూజలు చేస్తున్న విశాఖ శారదా పీఠాధిపతులు


ఉదయాస్తమాన సేవ టికెట్లు కొనగోలు చేస్తున్న భక్తులు


విశాఖ శారదా పీఠాధిపతులకు వీడ్కోలు